సీరియల్

నాలుగవ భాగము

"వాళ్ళ గుండు తగిలినట్లుంది. నీ దగ్గరకు వెళ్ళొస్తానని వెనక్కి తిరిగాడో, లేదో, బోటులోంచి వచ్చిన గుండు తగిలింది" అన్నాను.

రెండో డెవిల్ కు నా మాటలు నమ్మకం కలిగించనట్లుంది. అతను నావైపు అనుమానంగా చూశాడు.

శవం వెల్లకింతలా పడుంది. కాలితో దాన్ని త్రిప్పాడు. కూర్చుని టార్చిలైటు వెలిగించాడు వీపున తగిలింది గుండు.

హెలికాప్టర్ బయలుదేరి సముద్రం పైకి వచ్చింది. ఎక్సయిజ్ వాళ్ళ బోట్ లోంచి లౌడ్ స్పీకరులోంచి ఏవో మాటలు వినరాసాగాయి.

చేతిగుడ్డతో రక్తం తుడిచాడు గాయం దగ్గర. టార్చి వెలిగించి చూశాడు. డెల్లా నా దగ్గిరున్న తన రివాల్వరు మెల్లగా లాక్కొని దూరంగా వెళ్ళి కూర్చుంది.

"మిస్టర్ రాజ్! ఇది ఎక్సయిజ్ వాళ్ళ కాల్పులతో

జరిగిన ఘోరంకాదు!'' అన్నాడతను.

''అంటే!''

''ఆ గుండుచేసిన గాయం చూశావా? చాలా చిన్నది. వాళ్ళు మెషిన్‌గన్స్‌తో కాలుస్తున్నారు. ఆ గుండు తగిలితే యింకా పెద్ద గాయం కావాలి. అంటే అతన్ని నువ్వే చంపివుండాలి. అవునా?'' అడిగాడు. అతని కళ్లు చింతనిప్పుల్లా వున్నాయి. గన్ పైకెత్తి నావైపు గురిచూసి పెట్టాడు.

''నా దగ్గర రివాల్వరు మాటటుంచి, కనీసం చిన్న కత్తిగూడా లేదు. అయినా అతన్ని చంపితే నాకేమొస్తుంది'' అన్నాను నేను.

''మిస్ డెల్లా! కమ్‌హియర్!'' పిలిచాడు డెవిల్.

డెల్లా లేచివచ్చింది.

''అతని పాంటు, చొక్కా వెతుకు!'' అన్నాడు అధికారికంగా.

డెల్లా వెతికింది. ''ఏమీ లేవు. సిగరెట్లు తప్ప!'' అంది. అయినా అతనికి నమ్మకం కలిగినట్లు లేకపోవడంతో ''మిస్టర్ రాజ్! చేతులు పైకెత్తు!'' అన్నాడు.

నేను అతను చెప్పినట్లే చేశాను.

''డెల్లా! గుండీలువిప్పి అతని పాంటు, చొక్కా తీసి నాకివ్వు'' అన్నాడు.

డెల్లా మెల్లగా నా దగ్గరకొచ్చి నిలబడింది. ముందు చొక్కా విప్పింది. తీసి ఉండగచుట్టి డెవిల్ వేపు విసరింది.

లౌడ్‌స్పీకర్‌లోంచి మాటలు స్పష్టంగా వినిపించాయి. ఎక్సయిజ్ అధికారులు, అనవసరమైన పోరాటం ఆపివేసి మర్యాదగా లొంగిపొమ్మని, లేకుంటే బోట్‌ను పేల్చుతామనీ హెచ్చరించారు.

పాంటు బొత్తాము లూడదీసి రెండు చేతుల్తో నడుం

దగ్గర్నుంచి క్రిందకు లాగింది. కాలొక్కొక్కటే ఎత్తి ప్రక్కకు పెట్టాను. పాంటు వూడిపోయింది. దాన్నిగూడా చుట్టి అతనికి అందించింది.

హెలికాప్టర్ పైన సర్కిలింగ్ మొదలెట్టింది.

నాకు ప్రాణాలపైన ఆశ చచ్చిపోయింది. పోలీసుల ఆధీనంలో ఖైదీగా వుండడం ఇష్టంలేక తప్పించుకొచ్చినందుకు ఇప్పుడు వింత హంతకులమధ్య ఖైదీగా చిక్కిపోవడం తలచుకుంటే విచారం కలిగింది.

ఇలాంటి పరిస్థితులు ఎదురవుతాయని నేను ఊహించనే లేదు.

"అతని బనీను, డ్రాయరు తీసెయ్!" అన్నాడతను కోపంగా.

డెల్లా సిగ్గుపడుతూ నిలుచుంది.

"నేను చెప్పినట్లు చెయ్యకుంటే కాల్చి చంపుతాను" అన్నాడతను బిగ్గరగా.

డెల్లా ఉలిక్కిపడింది. ఒక్క వుదుటున నా బనీను తీసింది. డ్రాయరు లాగింది. నన్ను నగ్నంగా నిలబెట్టాడు డెవిల్.

డెల్లా తలవంచుకొంది. కానీ ఓరకంటితో నా శరీరంకేసి చూడసాగింది! నాకు ఒళ్ళంతా ముళ్లు గ్రుచ్చుకుంటున్నట్లుగా వుంది. ఆడవాళ్ళ ముందు నగ్నంగా నిలబడటం ఎంత బాధాకరమో అర్థంకాసాగింది.

"ఇప్పుడైనా నా దగ్గర ఆయుధాలులేవని నమ్ముతావా?" అడిగాను.

"ఆఁ!" అంటూ తుపాకీ డెల్లావేపు త్రిప్పాడు.

"మిస్ డెల్లా! నౌ యువర్ టర్న్. చేతులు పైకెత్తు!" అన్నాడు.

డెల్లా అలాగే చేసింది.

"మిస్టర్ రాజ్! స్ట్రిప్ హార్!" అన్నాడు.

నా గుండెల్లో బండపడింది. ఆమె బట్టలు విప్పడం నాకు సిగ్గుగా వుండటం అటుంచి, నా దగ్గరున్న రివాల్వరు ఆమె తీసుకుంది. ఇప్పుడా బట్టలు విప్పితే అదికాస్త బయటపడుతుంది. దాంతో మా రహస్యం తెలిసిపోతుంది. ఆ తర్వాత జరిగేది అతని చేతిలో చిక్కడం.

"సారీ! ఆమె స్త్రీ. ఇలా ఆమెను అనుమానించడం అన్యాయం!" అన్నాను నేను.

"మనం దొంగలం! స్మగ్లింగ్ మన వ్యాపారం! ఆడా మగా తేడాగానీ, మంచి చెడ్డల మీమాంసగానీ మన కుండకూడదు. నేను చెప్పినట్లు చేస్తే సరే! లేకుంటే అనవసరంగా ఆమె ప్రాణాలు పోగొట్టిన వాడివవు తావు" అన్నాడు అతను కోపంగా.

నాకేటూ పాలుపోలేదు.

"మనం నిరపరాధులం! అతని అనుమానం తీర్చుకో నివ్వండి" అంది డెల్లా ధైర్యంగా. ఆమెకంత ధైర్యం ఎలా వచ్చిందో నా కర్థంకాలేదు.

"క్విక్!" అరచాడు మళ్ళీ.

హాట్ పాంట్సు విప్పాను. తొడలకు ఘట్టిగా అతుక్కుపోవడంతో చేతులు లోపలపెట్టి బలవంతంగా క్రిందకులాగాను. లావుపాటి ఎర్రటి తొడలకు నా చేతులు తగలగానే ఆమె కదలింది. నిట్టెడ్ బనియన్ విప్పాను. బ్రాసరీ, అండర్ వేర్ మాత్రం మిగిలాయి.

"అవికూడా తీసెయ్!" అన్నాడు.

రొమ్ములమధ్య వున్న లోయలో, బ్రాసరీలోపల ఆమె అంతకుముందా రివాల్వరు దాచుకుంది. అదింకా అక్కడే వుందని నా నమ్మకం. చేత్తో తడిమాను. తగల్లేదు.

"ఇక్కడేమీ లేదు!" అన్నాను నేను.

"ఆ ఎత్తుగా వున్నదేమిటి?" అడిగాడు డెవిల్.

నాకు ఒళ్ళుమండింది. ఆడదానికక్కడ ఎత్తుగా ఏముంటుందో తెలియనట్లుగా అతనడగడం నాకు కోపం తెప్పించింది. ఆమెను సెర్చ్ చెయ్యాలనుకుంటున్నాడో లేక నగ్నంగా వున్నప్పుడు ఎంత అందంగా వుంటుందో చూడాలనుకుంటున్నాడో నాకు అంతుబట్టలేదు.

అంతలో నే భూమి బ్రద్దలయినట్లు పెద్ద శబ్దమైంది.

నా చెవులు గింగుర్లెత్తాయి. బోటు తల్లక్రిందులైనట్లు ఊగింది. నేను పడిపోయాను. నా వెంట డెల్లాకూడా పడిపోయింది. డెవిల్ ఏమయినాడో చూడలేదు.

అంత పెద్ద ఊపు ఎందుకొచ్చిందో అర్థంగాలేదు.

"ఏమయింది?" అడిగింది డెల్లా.

"తెలీలేదు!" అన్నాను.

"ఆ శబ్దం విన్నావా? ఎవరు బాంబ్ వేసినట్లున్నారు!" అంది డెల్లా.

నాక్కూడా అలాగే అనిపించింది. షిప్ లోనుంచి బయలుదేరిన హెలికాప్టర్ బాంబ్ వేసివుంటుంది. కానీ అది మా బోటుపైన పడలేదు. చాలా దూరంగా పడింది. ఎక్సైయిజ్ వాళ్ళు మైక్ లో అనౌన్స్ చేస్తుండటం విని వుంటారు, హెలికాప్టర్ లోనివాళ్ళు. ముందా బోటుఅంతు చూచి తర్వాత మా మీదకు రావాలని నిశ్చయించుకుంటారు. అందుకే ముందా బోట్ ని బాంబ్ వేసి వుండా లనిపించింది.

నా అనుమానం డెల్లాకు చెప్పాను.

ఆమెకూడా నా అభిప్రాయంతో ఏకీభవించింది.

మేమిద్దరంలేచి గబగబా బట్టలు వేసుకున్నాము.

డెవిల్ కూడా లేచాడు. అతనితల దేనికో కొట్టుకున్నట్లుంది. రక్తం కారుతోంది. జేబురుమాలుతో తుడుచు

కుంటున్నాడు. నన్ను చూడగానే "వాళ్ళ బోట్ ముక్కలయిపోయింది" అన్నాడు.

"ఎవరి బోటు?" అడిగాను.

"మనల్ని పట్టుకుందామని వచ్చిన ఎక్సయిజ్ వాళ్ళది!"

"అంతమాత్రాన మనకు ప్రమాదం తీరిపోలేదు. ఆ హెలికాప్టర్ తిరుగుతూనే వుంది. ఈ మారు మనపైన వేస్తారు బాంబు" అన్నాను.

"వెయ్యరు?" దృఢంగా చెప్పాడతను కర్చీఫ్ సముద్రంలోకి విసిరేస్తూ.

"ఎందుకని?"

"వాళ్ళమనిషి డెల్లా మనదగ్గర వుంది. ఛస్తే ఆమెకు ఆపద తెచ్చిపెట్టరు."

"భగవంతుడిపైన భారంవేసి, కూర్చోవడం మినహా మనం చేసేదేమీ లేదు. అయినా మీరిద్దరూ రాక్షసుల్లా వాళ్ళను చంపారు."

"జరిగిందాని గురించి ఆలోచించడం, చింతపడటం పిరికివాళ్ళు చేసేపని. జరగవలసినదాన్ని జయప్రదంగా జరిపించేందుకు మార్గాలు చూచుకోవడం మా పద్ధతి. నువ్వు ధైర్యంగా వుండు. డెల్లాను కనిపెట్టి వుండు. మనల్ని మరిపించి ఆమె సముద్రంలోకి దూకి తప్పించుకోకుండా చూడాలి. ఆమె మనతో వున్నంతసేపూ మన ప్రాణాలు గట్టిగానే వుంటాయి" అన్నాడు డెవిల్ అక్కడ్నించి కదిలి వెళ్తూ.

విస్కీ కేస్ ప్రక్కకు నెట్టి, దాని క్రిందున్న రివాల్వర్ తీసి నా కందించింది.

అందుకుంటూ ఆమె సమయస్ఫూర్తికి మెచ్చుకున్నాను.

హెలికాప్టర్ ఈమారు క్రిందికల్లా వచ్చింది. లైట్ మా ముఖంపైన పడింది. డెవిల్ మిషిన్‌గన్‌తో ప్రొపెలర్ పైకి పేల్చాడు.

"ఆ షాటు మిస్సయింది. లేకుంటే హెలికాప్టర్ కూలిపోయేది" అంది డెల్లా.

"వాడు ట్రెచరస్ ఫెలో! నాకు ఆకస్మికంగా తగిలారిద్దరూ!" అన్నాను.

"వీడ్ని కూడా ముగిస్తే, మనబోటుకు హెలికాప్టర్‌తో ప్రమాదం లేకుండా చూసుకోవచ్చు" అంది డెల్లా.

"ప్రయత్నిస్తాను" అన్నాను అక్కడ్నుంచి కదిలి డెవిల్ వైపు వెళ్తూ.

"నా షాట్ నేరోగా మిస్సయింది. లేకుంటే హెలికాప్టరు కూలిపోవలసింది" అన్నాడు.

"చూశాను" అన్నాను.

"ఇంకో గన్ వుంటే బాగుండేది."

"ఎందుకు?"

"ఇద్దరం కాలిస్తే ఖచ్చితంగా కూలిపోయేది."

"నేనంత ఎక్స్‌పర్ట్‌ను కాదు!"

మళ్ళీ ఆకాశంలోకి గురిపెట్టాడు గన్. తల పైకెత్తాడు. హెలికాప్టర్ సర్కిల్‌లా తిరుగుతోంది బోటు చుట్టూ.

నేను మెల్లగా జేబులో చెయ్యిపెట్టి రివాల్వరు తీశాను.

అతను హెలికాప్టర్ తిరిగినవేపే తల త్రిప్పుతూ గన్ పొజిషన్ మారుస్తున్నాడు.

ఇంతకన్నా మంచి అవకాశం రాదనిపించింది.

రివాల్వరు మెల్లగా పైకెత్తి అతని గుండెలకు గురిపెట్టాను.

నా రివాల్వరు ట్రిగ్గర్ నొక్కాను.

అతని తుపాకీ ఆకాశంలోకి పేలింది. కెవ్వున అరుస్తూ అతను ప్రక్కకు పడిపోయాడు.

నా కళ్ళు బైర్లు కమ్మిస్తూ, పెద్ద వెలుగుతో బాంబు బోట్ పైన నాకు పదడుగుల దూరంలో పడింది. మా బోట్ ముక్కచెక్కలై ఆకాశంలోకి ఎగిరాయి.

నాకు తరువాత ఏంజరిగింది తెలీలేదు.

* * *

చటుక్కున మెలకువ వచ్చింది. కళ్లు తెరచి చూశాను.

బోటు తాలూకా పెద్ద చెక్కపైన వున్నాను నేను. ఒళ్ళంతా నొప్పులుగా వుంది. మెల్లగా లేచి కూర్చున్నాను. చుట్టు చూశాను.

కొంచెం దూరంలో నీళ్ళలో తేలుతూవున్న రబ్బరు ట్యూబ్,దానిమధ్య చలనంలేకుండా డెల్లా కనుపించింది.

చుట్టు దృష్టి సారించాను. కనుచూపుమేర ఎక్కడ చూసినా అనంతమైన నీటితెర తప్ప మరేమీ కనుపించలేదు. నీళ్ళన్నీ ప్రశాంతంగా వున్నాయి. అంటే మేము తీరానికి ఎటువైపు ఎక్కడ వున్నామో తెలియలేదు.

నేను తెచ్చుకున్న కేన్డ్ ఫుడ్, విస్కీసీసాలు, మిగిలిన వస్తువులు మొత్తం సముద్రం పాలయ్యాయి. జేబు తడుముకున్నాను. సిగరెట్ పాకెట్ వుంది. వెలుపలకు లాగి తెరచి చూశాను. అందులో ఏడు సిగరెట్లున్నాయి. కాని అవి తడిసి పనికిరాకుండా వున్నాయి.

మెల్లగా చేతులతో నీళ్ళలో తెడ్లువేస్తున్నట్లు కదుపుతూ, డెల్లా మత్తుగా పడివున్న లైఫ్ ట్యూబ్ వైపు ప్రయాణించాను.

తెడ్లువేసి పడవలు నడపడం నాకెప్పుడూ అలవాటు లేదు. అందువల్ల నేను ఎక్కివున్న బోటుతాలూకు

చెక్క ను, డెల్లా వైపు తీసుకెళ్ళడం బ్రహ్మప్రళయమైంది.

అరగంటపైగా తంటాలు పడ్డాక ఆమె దగ్గరకు చేరుకున్నాను. ఎడంచేత్తో ట్యూబ్ ను గట్టిగా పట్టుకుని నా వైపుకులాగి పట్టుకున్నాను. ఆ ప్రయత్నంలో నేను కొంచెం ముందుకు జరగాల్సివచ్చింది. బరువు ఒకప్రక్కకు జరగడంతో వెనుకవైపునున్న చెక్కభాగం పైకిలేచి నేను జర్రున నీళ్ళలోకి జారిపోయాను.

అది గ్రహించి రెండోచేత్తో కూడా ట్యూబ్ ను పట్టుకున్నాను. తలమాత్రం ట్యూబ్ పైనుంది. శరీరం నడుములపైదాకా నీళ్ళల్లో వుంది.

చెక్క దూరంగా వెళ్ళిపోయింది.

డెల్లా అప్పటికీ కళ్ళు తెరవలేదు. ఆమె ప్రాణాలతో వున్నదీ లేనిదీ నా కర్థంగాలేదు. దమ్ముపట్టి, శరీరంలోని శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకుని, నడుం క్రిందిభాగాన్ని తేలికచేసి పైకెగిరాను. దెబ్బతో ట్యూబ్ మీద కొచ్చాను.

ఒకవైపు కూర్చుని, కాళ్ళు రెండూ ట్యూబ్ కు రెండు వైపులా పెట్టుకొన్నాను. నా కాళ్ళమధ్య డెల్లా వుంది.

దగ్గరగా చూశాను. ఆమె రొమ్ములు క్రిందకు, పైకీ ఊగుతున్నాయి. ఆమె శ్వాస పీల్చుకోవడం గమనించి ఆనందించాను.

ఇండియా చూడాలని వచ్చిన డెల్లా సముద్రంమధ్య, చావుబ్రతుకుల నడుమ, అచేతనంగా పడివుండటం తలచుకుంటే నాకు మనస్సు కలుక్కుమంది. ఆమెకే ఆపదా రాకుండా కాపాడమని భగవంతుడ్ని ప్రార్థించాను.

"డెల్లా! డెల్లా!" పిలిచాను.

ఆమె పలకలేదు. నా పిలుపు ఆమెకు వినిపించినట్లు లేదు.

ముందుకు వంగి ఆమె చెవులో నోరుపెట్టి ఘట్టిగా

అరచాను. చలించలేదామె.

చెయ్యి పెట్టి సముద్రంలోంచి కొద్దిగా నీళ్ళు తీసుకొని ముహంపైన చల్లాను.

ఆమె చిన్ననోరు తెరచుకుంది. సన్నటి పెదాలను; నాలుకతో చప్పరించింది. ఉప్పగా తగిలిందేమో 'థూ' మంటూ ఉమ్మి వేసింది.

ఆమె కళ్ళు తెరచుకున్నాయి.

నాకు ఆనందం అంతులేకుండా కలిగింది.

"డెల్లా! ఎలాగుంది?" అడిగాను పైకి వంగి.

"మన బోట్ ఏమయింది?" అడిగింది డెల్లా.

"వాళ్ళు బాంబు వేశారు. అది కాస్తా మన బోట్ పైన పడింది. ముక్కలయిపోయింది గాబోలు. మనమిలా ప్రాణాలతో మిగిలాం" చెప్పాను.

నడుంపైకి లాక్కొని, కదుకుని లేచి కూర్చుంది ట్యూబ్ పైన నా కెదురుగా. చుట్టూ చూసింది.

"మనం సముద్రం మధ్యలో చిక్కుకొన్నట్లున్నాం. తినేందుకేమయినా వుందా?"

"లేదు. నేను తెచ్చిన సామానంతా సముద్రంలో కలిసిపోయింది."

"ఇప్పుడేం చేద్దాం!" అంది డెల్లా విచారంగా.

"అదే అర్థంగావడంలేదు. తీరానికి మనమెంత దూరమున్నామో నాకు అర్థంగావడంలేదు. కనీసం నౌకలు ప్రయాణంచేసే మార్గంలో కూడా మనమున్నట్లులేదు. ఆహారంకూడా మనదగ్గర శూన్యం. ఇలా ఎంతసేపో ఈ నడిసముద్రంలో నిలబడి బ్రతకలేం. ఆకలితో చచ్చిపోతామన్న అనుమానంగా వుంది" నా మనస్సులో వున్న ఊహల్ని వెలుపలకు మాటల్లో చెప్పాను.

"చావడం ఎటూ తప్పదన్నప్పుడు, మనిషి బ్రతికేందుకు

చెయ్యవలసిన అన్ని ప్రయత్నాలు చెయ్యాలి. ఇలా ఊరకే కూర్చోవడంకన్నా మన నాలుగు చేతుల్నీ తెడ్లుగా చేసి ముందుకు జరుగుదాం. అదృష్టముంటే మనకేదైనా తీరం కనుపించటమో, లేక ఏదైనా షిప్ కనుపించటమో జరుగవచ్చు" అంది డెల్లా.

ఆమె మాటలు సమంజసంగానే తోచాయి.

ఇద్దరం సర్దుకుని కూర్చున్నాం ట్యూబ్ పైన. మెల్లగా చేతుల్తో నీళ్ళను వెనక్కి నెట్టసాగాం. ట్యూబ్ ముందుకు ప్రయాణం మొదలెట్టింది.

రెండు గంటలసేపు అలాగే ప్రయాణించాం.

నాకు చేతులు, భుజాలు నొప్పిపుట్టడం మొదలెట్టాయి. ఆ విషయం డెల్లాకు చెప్పాను.

డెల్లా నవ్వింది. అలవాటులేక అలా వుంటుందనీ, ఆ నొప్పిని లెఖచెయ్యకుండా తెడ్లు వేస్తుంటే కొంతసేపటికి ఆ నొప్పి మరచిపోవచ్చని సూచించింది.

ఓపిక లేకున్నా ఆడదానిముందు ఓడిపోవడం, చిక్కు మొహం పెట్టడం అనుమానంగా భావించి, నీళ్ళను చేతుల్తో వెనక్కి నెట్టసాగాను.

ఆకాశం వున్నట్టుండి నల్లబడిపోయింది. మేఘాలు ఎక్కడెక్కడనుంచో వచ్చి మా నెత్తిన మీటింగు పెట్టుకుని, మేము చేస్తున్న వ్యర్థ ప్రయత్నం గురించి చర్చించుకోవటం మొదలెట్టినట్లనిపించింది. మాకు సముద్రం కూడా కనుపించలేదు.

"మిస్టర్ రాజ్! ఇదేమిటీ విపరీతం! ఉన్నట్టుండి వాతావరణం ఇలా మారిపోయింది?" అడిగింది డెల్లా.

"మన ప్రాణాలు తీసేందుకు."

"వానవస్తే ఏం చేద్దాం?"

"చేసేందుకేముంది. తడుస్తూ కూర్చోవడమే" అన్నాను.

డెల్లా తలపైకెత్తి ఆకాశంకేసి చూసి "మంచి వాన వస్తుందనుకుంటాను. సముద్రంలో వాన కురవడం మొదలెడితే ఒకరాగాన ఆగదని ఏదో నవలలో చదివాను" అంది.

"మన ప్రాణాలుతీసి, శవాల్ని సముద్రంలోకి త్రోసి, ఆ తర్వాత ఆగుతుంది" అన్నాను నేను నిస్సహాయంగా.

ఆమె మాట్లాడలేదు. ఉరుములు హోరెత్తాయి. మెరుపులు ప్రారంభమయినాయి. వాన మొదలయింది.

ఏనుగ తొండాలంత లావుగా వున్నాయి చినుకులు. నెత్తిన పడుతుంటే మాడు చిట్లిపోయినట్లవుతుంది నాకు. డెల్లా రెండు చేతులు తలపైన పెట్టుకుంది.

చెవులు గింగుర్లు పెడ్తూ జుంయ్‌మని శబ్దమేదో దూరంగా వినవచ్చింది.

"ఏమిటా హోరు?" అడిగింది డెల్లా.

"గాలిలాగుంది" అన్నాను.

"అయితే మనకిక చావు తప్పదు. ఒక చేత్తో నన్ను ఘట్టిగా పట్టుకోండి. మరో చేత్తో ట్యూబ్‌ను పట్టుకొని కాళ్ళమధ్య ఘట్టిగా ఇరికించుకోండి. నేనూ అలాగే చేస్తాను. అదృష్టముంటే మనం ఏ తీరానికో కొట్టుకొని పోతాం. లేకుంటే ఇద్దరం యీ సముద్ర గర్భంలోనే కలసిపోతాం!" అంటూనే నన్ను కౌగలించుకుంది డెల్లా.

నేనుకూడా ఆమెను అలాగే కౌగలించుకొని, కాళ్ళ మధ్య ట్యూబ్‌ను ఇరికించి పట్టాను.

గాలి వచ్చేసింది, సముద్రంలో పైన తేలుతున్నట్లున్న నీటిపొరను, తెరచాపలా పైకిలేపి విసరికొడుతూంది గాలి. అదిచేసే శబ్దానికి మా చెవులు గింకుర్లెత్తాయి.

మా ట్యూబ్ ఎగిరిపడసాగింది. ఒకొక్క ఊపుకూ గాలితో లేచి నూరుగజాల అవతల మళ్ళీ తేలిపడుతూ

పోసాగింది. మేమిద్దరం అలాగే ఒకరినొకరం కరచి పట్టు కొని కాళ్ళతో ట్యూబ్‌ను బిగించిపెట్టాము. అలా ఎంత సేపు గడిపామో మాకే తెలియదు.

దూరంగా ఎండపొడలు కనుపించాయి. గాలి జోరు తగ్గింది. మా ప్రాణాలు రక్షించిన రబ్బరు ట్యూబ్ నీళ్ళ మీద నిలబడింది.

దూరంగా ఏదో ఎత్తైన కొండలాంటిదేదో కనుపించింది.

డెల్లాకు చూపించాను. డెల్లా ఆనందంతో కేరింతలు కొట్టింది.

"మనల్ని ఆ గాలి తీరం వేపు త్రోసుకొచ్చింది" అన్నాను.

"యస్. యస్. మనం కాస్త కష్టపడితే ఒడ్డున పడతాం" అంది డెల్లా.

"అది భారతదేశమేనా?" అనుమానంగా అన్నాను.

"ఏ దేశమైతే నేం. ఈ నీళ్ళల్లోంచి బయటపడితే చాలు" అంది డెల్లా.

మళ్ళీ నాలుగు చేతులకూ పని పెట్టాం. అరమైలు దూరం వెళ్ళాం. నాకు చేతులు నొప్పి ఎక్కువయింది.

తీరం మరికొంత దూరంలో వుండగా రబ్బరు ట్యూబ్ కు ఏమైందోగాని 'ఢాం'మని ప్రేలిపోయింది.

ట్యూబ్‌లోని గాలంతా వెళ్ళిపోయి, అది అప్పడంలా అణగిపోయింది. ఆ విసురుకు మేమిద్దరం సముద్రంలోకి మునిగిపోయాం. ఏం జరిగిందో అర్థమయింది.

చేతు లాడిస్తూ ఈదుకుంటూ ఆమెనుకూడా నీళ్ళ పైకి లాక్కొచ్చాను.

డెల్లా తనకు ఈదడం వచ్చని, నానుండి విడివడింది. ఆమె ముందూ, నేను వెనుకా ఈదుకుంటూ ముందుకు

సాగిపోసాగాం.

అలలు దగ్గరవుతున్నాయి. వాట్ని చూసి డెల్లా ఆనందంతో యింకా జోరుగా ఈతకొట్టడం ప్రారంభించింది.

సముద్రతీరంలో ఫర్లాంగుదూరం మాత్రమే అలలు వుంటాయి. అంటే తీరానికి మేమింక ఫర్లాంగున్నాం. అది దాటితే భూమిపైన కాలుపెట్టగలం. లేని సత్తువ కాళ్ళల్లోకి తెచ్చుకున్నాను. ముందుకు పోసాగాను.

డెల్లా ఆడదైనా అతిలాఘవంగా ముందుకు ముందుకు మునిగిపోకుండా జరిగిపోతూనేవుంది.

మరో అరగంట నానాతంటాలుపడి తీరం చేరుకున్నాం ఇద్దరం.

నీళ్ళ అంచునే ఇసుకలో వెల్లకిలా శవాల్లా పడిపోయాం.

అరగంటసేపు ఎండలో శరీరాల్ని ఎండబెట్టి వెచ్చ చేసుకున్నాం.

మెల్లగా లేచి నడక సాగించాం. ఇసుకలోనే అర మైలు నడిచాం.

పొదల్లాంటి చిన్నచిన్న చెట్లగుబుర్లు కనుపించాయి. అటువంటి వాట్ని అంతకుముందు నేనెక్కడా చూడలేదు.

"ఇది ఇండియాకాదు!" అన్నాను నేను.

"ఎలా తెలుసు?"

"ఈ రకం చెట్లు నేను ఎప్పుడూ చూడలేదు. ఇదేదో దీవిలాగుంది. ఇక్కడి మనుషులెలాంటి వాళ్ళో ఏమిటో మనకెలా తెలుసుంది?" అడిగాను.

"డోన్ట్వరీ! చావు తప్పదని తెలిసీ బ్రతికే ప్రయత్నం చేస్తున్నాం మనం. చావడం తప్పనిసరయితే చచ్చిపోదాం. దానిగురించి కంగారుపడకు!" అంది డెల్లా.

ఆమె గుండె నిబ్బరానికి ఆశ్చర్యపోయాను నేను.

ఆ గుబురు చెట్లలోంచి ముందుకు కొంతదూరం సాగిపోయాం.

మనుషులుగానీ, పశువులుగానీ కనుపించలేదు. ఏదైనా నిర్మానుష్యమైన దీవి గాబోలనిపించింది.

ఆకాశంలో పెద్ద చప్పుడు వినిపించింది.

ఇద్దరం ఒక్కసారే తలెత్తి పైకిచూశాను.

ఒక పెద్ద పక్షుల గుంపు అరుపులు పెడుతూ, రెక్కలూపుతూ అక్కడికక్కడే గిరగిర తిరగసాగింది. ఆ గుంపు దిగే స్థలం మాకు ఫర్లాంగు దూరంలో వుంది.

"సీ దట్ సీన్!" అంది డెల్లా.

తలూపాను నేను.

"అక్కడేదో జరిగింది. ఆ పక్షులు ఒకటి చావడమో, లేక మరేదైనా విచిత్రమైన విషయమో జరిగివుండాలి. అందుకే పక్షులలా గగ్గోలు పెడుతున్నాయి. మనం వెళ్ళి చూద్దాం!" అంది డెల్లా.

"ఓ. కే! వెళ్దాం పద!" అన్నాను.

ఇద్దరం ముందుకు నడిచాం.

పక్షులింకా ఆకాశంలో అల్లరి చేస్తూనే వున్నాయి.

గుబురు చెట్లనడుమ రెండు పక్షులు పడివుండటం గమనించి వాటిని డెల్లాకు చూపించాను. ఇద్దరం వాటికి దగ్గరగా నడిచాం. డెల్లా వాటి దగ్గర కూర్చుని నిశితంగా చూడసాగింది. రెండు నిముషాలు పరిశీలనగా పరికించి "రాజ్! వండర్‌ఫుల్! వండర్‌ఫుల్!" అంది ఎగురుతూ.

"ఏమైందిక?" అంటూ ఆమె దగ్గరగా వెళ్ళాను.

"ఈ బర్ట్స్‌ను ఎవరో కాల్చి చంపారు. రెండింటి రెక్కలగుండా రివాల్వరు గుండ్లు దూసుకు వెళ్ళాయి.

అవి దూసుకువెళ్ళిన చోట్ల నల్లగా కాలిపోయాయి ఆకలు. చూశావా?" అడిగింది.

నేనుకూడా వంగి పరీక్షగా చూశాను. ఆమె చెప్పి నట్లుగా రివాల్వరు గుండ్లుచేసిన చిన్న రంధ్రాలు కనుపించాయి.

"యూ ఆర్ కరెక్ట్!" అన్నాను నేను.

"అంటే ఈ దీవిలో మనుషులున్నారన్నమాట. మనకు ఆహారం, సిగరెట్లు అదృష్టముంటే హాట్ డ్రింక్స్ అన్నీ దొరుకుతాయి. లెటజ్ గో!" అంది డెల్లా.

ఇద్దరం అక్కడ్నుంచి చెట్లు దాటుకుంటూ నడక సాగాం. ఇళ్ళుగానీ, మరేవిధమైన మనుషులు నివసించే జాడలుగానీ, మాకు కనుపించ నేలేదు.

నాకు ఆకలి విపరీతంగా ఉండటంతో నడవలేక కూల బడ్డాను. డెల్లాకూడా నా ప్రక్కనే చతికిలబడింది.

"ఈ చెట్లకు కాయలుకూడా లేవు పీక్కుతిందా మంటే!" అన్నాను కోపంగా.

"ఏం? ఆకలి ఎక్కువగా వుందా?" అడిగింది డెల్లా.

"నాకు తొందరగా తినేందుకేమీ దొరకకపోతే నిన్ను తింటాను" అన్నాను.

"ఆ చెట్లకు కాయలులేవు. కానీ కావలసినంత ఆకుంది. తింటే ఆకలి తీరుతుందిగా!" అంటూ చేరువలో వున్న చెట్టునుంచి రెండు చేతులతో ఆకును తుంపడం మొదలెట్టింది.

"కొంపతీసి తింటావా?" అడిగాను నేను.

డెల్లా మాట్లాడలేదు.

నేను గుడ్లప్పగించి ఆమెను గమనించసాగాను.

ఆకులు నోట్లో పెట్టుకుని కరకరమని ఆవులు పచ్చగడ్డి తిన్నట్లు ఆవురావురుమంటూ నమిలి మ్రింగసాగింది.

"ఎలావున్నాయి?" అడిగాను.

"చాలా బాగున్నాయి. ఆ పసరు రక్తంలో కలుస్తుంటే క్రొత్తశక్తి పుట్టుకొస్తున్నట్లుంది. నువ్వూ తిను" అంది డెల్లా కానిని ఆకులు నా కందిస్తూ.

నేనుకూడా నోట్లో పెట్టుకున్నాను. ఉప్పంగా వున్నాయి. నమిలాను. రసం దిగుతుంటే నోరంతా తిమ్మిరెక్క సాగింది. లెక్ఖ చెయ్యకుండా నములుతూనే వున్నాను. కడుపులో రగిలిన ఆకలిమంటలు అణగిపోయే దాకా ఇద్దరం ఆ ఆకులు తిన్నాం.

ఆ తర్వాత అక్కడే పడుకున్నాం.

సముద్రంలో పడ్డ బాధలు ఒకరికొకరం చెప్పుకుంటూ నవ్వుకుంటూ చాలా సేపు వుండిపోయాం.

"గంటెంతయి వుంటుంది?" అడిగింది డెల్లా.

నేను వాచీకేసి చూశాను. నీళ్ళలో తడిసి పని చెయ్యడం మానేసింది.

"తెలీదు!" అన్నాను.

"లేచి అలా వెళ్దాం! ఎవరన్నా కన్పిస్తారేమో చూద్దాం!" అంది డెల్లా.

"అలాగే!" అంటూ లేచి గుడ్డలకు పట్టిన ఇసుకంతా దులుపుకున్నాను. డెల్లాగూడా అలాగే చేసింది.

ఇద్దరం మళ్ళీ నడక ప్రారంభించాం. కాళ్లు నొప్పి పుట్టేదాకా ఆ దీవిలో నడిచాం. దాదాపు రెండుగంటలు నడిచాక నా కళ్ళకు బార్బ్‌డ్ వైర్ ఫెన్స్ కనుపించింది. డెల్లాకు చూపించాను.

ఆ ఫెన్స్ కనుచూపు మేరదాకా వుంది.

"ఏమిటిది? ఎవరు వేశారు?" అడిగాను.

(సశేషం)